సాక్షి వికారాబాద్

శనివారం। 23। ఆగస్టు। 2025



వీడిన ఆలయాల చోరీ కేసు

యాలాల మండలం సంగెంకుర్దు శివారులోని రెండు ఆలయాల్లో జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించారు. 10లో▸



కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పండి

హామీలు అమలు చేయని కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి కోరారు. 10లో▸



సామాజిక తనిఖీకి సిద్ధం

ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులను ఆడిట్ బృందం శుక్రవారం నుంచి పరిశీలించనుంది. 11లో▸

న్యూస్‌రీల్

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

ఎమ్మెల్యే కాలె యాదయ్య



దాతాపూర్‌లో పశువుల పాక పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

నవాబుపేట: అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. శుక్రవారం నవాబుపేట మండలం దాతాపూర్ గ్రామంలో పనుల జాతర కార్యక్రమంలో భాగంగా పశువుల పాక పనులను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ఎల్లకొండ గ్రామంలో పశువుల పాక నిర్మాణానికి పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ సుధాకర్ భూమిపూజ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రాంరెడ్డి, ఏఎంసీ చైర్మన్ గీతాసింగ్ నాయక్, ఎంపీడీఓ అనురాధ, తహసీల్దార్ బుచ్చయ్య, డిప్యూటీ తహసీల్దార్ శ్రీలత, ఏపీఓ లక్ష్మీదేవి, మాజీ సర్పంచ్, ఎంపీటీసీ మాజీ సభ్యులు ఎక్‌బాల్, నాగిరెడ్డి, బల్వంత్‌రెడ్డి, ప్రభాకర్ పాల్గొన్నారు.

కార్మిక సమస్యలు పరిష్కరించాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటయ్య



అడ్డా కార్మికులతో సీపీఎం నాయకులు

పరిగి: పట్టణంలోని అడ్డా కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటయ్య కోరారు. శుక్రవారం అడ్డా కార్మికులతో మాట్లాడారు. పరిగి పట్టణంలో వందలాది మంది అడ్డా కార్మికులు ఉన్నారని తెలిపారు. వారికి కనీస సౌకర్యాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు పని చేయడం ద్వారా ప్రభుత్వానికి నిత్యం టాక్స్ రూపంలో కోట్లాది రూపాయలు వస్తోందన్నారు. కానీ వారి సంక్షేమం గురించి పట్టించుకోవడం లేదని తెలిపారు. మహిళా కార్మికులు పని కోసం అడ్డా వద్దకు వస్తే వారికి మూత్రశాలలు లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారని అన్నారు. మున్సిపల్ అధికారులు వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. చాలా మంది కార్మికులు లేబర్ ఇన్సూరెన్స్ చేసుకోవడం లేదని వారికి అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు హబీబ్, సత్తయ్య, రఘురాం, శ్రీను, జగదీష్, బాబయ్య, నర్సింహులు పాల్గొన్నారు.

ఉత్సవాలు ప్రశాంతంగా జరగాలి

డీఎస్పీ బాలకృష్ణారెడ్డి



డీఎస్పీ, సీఐలను సన్మానించిన సమితి సభ్యులు

తాండూరు టౌన్: వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి సూచించారు. శుక్రవారం హిందూ ఉత్సవ కేంద్ర సమితి సభ్యులు డీఎస్పీతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినాయక మండపాలు ఏర్పాటు చేసేవారు విధిగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మండపాల వద్ద డీజే సౌండ్ సిస్టమ్ ఏర్పాటు నిషేధమన్నారు. ఉత్సవాల సందర్భంగా బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం సమితి గౌరవాధ్యక్షులు రాజుగౌడ్, ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల నర్సిములు మాట్లాడుతూ.. ఉత్సవాలు ప్రశాంతంగా కొనసాగేలా సమితి తరఫున అన్ని జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. ఈసారి నాల్గవ రోజే వినాయక లడ్డూ వేలం పాట ఉంటుందన్నారు. లడ్డూ దక్కించుకున్న వారు ఐదవ రోజు పూజా కార్యక్రమాల అనంతరం లడ్డూను తీసుకెళ్లాలన్నారు. దీనివల్ల నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా పూర్తి చేసుకోవడానికి సమయం సరిపోతుందన్నారు. అనంతరం సమితి సభ్యులు డీఎస్పీ, పట్టణ సీఐ సంతోష్ కుమార్‌ను ఘనంగా సన్మానించారు.

25న సత్యాగ్రహ దీక్ష

తాండూరు టౌన్: త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు కందుకూరి రాజ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఇదే అంశంపై ఈనెల 25న హైదరాబాద్‌లో జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య తలపెట్టిన సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయాలని కోరారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..



అలుగు పారుతున్న కోట్‌పల్లి ప్రాజెక్టు

కోట్‌పల్లి ప్రాజెక్ట్ పొంగిపొర్లుతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు భారీగా నీరు చేరి అలుగు పారుతోంది.. దీంతో పర్యాటకుల తాకిడి పెరిగింది. జిల్లాతోపాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి జనం పెద్ద సంఖ్యలో వచ్చి సేదతీరుతున్నారు. నీటిలో ఆడుకుంటూ ఎంజాయ్ చేస్తున్నారు. ప్రాజెక్టు పరిసరాలు పర్యాటకులతో సందడిగా మారింది.

– ధారూరు



ప్రాజెక్టు నీటిలో పర్యాటకుల సందడి

అన్నదాత అరిగోస

- ఆగ్రోస్, డీసీఎంఎస్, పీఏసీఎస్‌లను ఆశ్రయిస్తున్న రైతులు
- కృత్రిమ కొరత సృష్టిస్తున్న ప్రైవేటు డీలర్లు

- వానాకాలం సీజన్‌కు అవసరమైన ఎరువులు 1,13,851 మెట్రిక్ టన్నులు
- అందుబాటులో ఉన్నది 6,230 మెట్రిక్ టన్నులు
- అవసరమైన యూరియా 39,898 మెట్రిక్ టన్నులు
- ప్రస్తుతం ఉన్నది 1,138 మెట్రిక్ టన్నులు మాత్రమే
- ప్రైవేటు డీలర్ల వద్ద 876 మెట్రిక్ టన్నులు
- సొసైటీల వద్ద 261 మెట్రిక్ టన్నులు

యూరియా కోసం దుకాణాల వద్ద క్యూ



ఎరువుల కోసం వికారాబాద్‌లో క్యూకట్టిన రైతులు

వికారాబాద్: ఎరువుల కొరత లేదని అధికారులు అంటున్నా ఫెర్టిలైజర్ దుకాణాలు, ఆగ్రోస్, డీసీఎంఎస్, పీఏసీఎస్‌ల వద్ద భారీ క్యూలు దర్శనమిస్తున్నాయి. నిత్యం రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. ఎరువుల విక్రయాల్లో ప్రైవేటు డీలర్లు మాయాజాలం సృష్టిస్తుండగా వ్యవసాయ శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారు. పీఏసీఎస్, డీసీఎంఎస్, ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాల్లో యూరియా నిల్వలు తక్కువగా ఉండటంతో వారు చేతులెత్తేస్తున్నారు. ఐదు ఎకరాల పొలం ఉన్న రైతుకు ఒకటి లేదా రెండు బస్తాలు ఇచ్చి చేతులు దులుపుకొంటున్నారు. ప్రైవేటు డీలర్ల వద్ద అధిక మొత్తంలో నిల్వలు ఉన్నా ఎంత స్టాక్ ఉందో చెప్పడం లేదు. నోటీసు బోర్డులో వివరాలు పొందుపరచడం లేదు. కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయించే ప్రయత్నం చేస్తున్నారు. సొసైటీలకు నామమాత్రంగా కేటాయించి ప్రైవేటు డీలర్లకు ఎక్కువ మొత్తంలో సరఫరా చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. కొందరు వ్యవసాయాధికారులు డీలర్లతో కుమ్మక్కవటంతో ఈ పరిస్థితి నెలకొందనే విమర్శలు ఉన్నాయి.

యూరియా కోసం అవస్థలు

ఎరువుల కొరత రైతన్నను ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. పది రోజుల తర్వాత వర్షాలు కాస్త తగ్గుముఖం పట్టడంతో యూరియా కొనుగోలుకు రైతులు ఎగబడుతున్నారు. ఫెర్టిలైజర్ దుకాణాల్లో స్టాకు లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఒక్కో రైతుకు రెండు బస్తాలు ఇస్తుండటంతో మళ్లీ మళ్లీ కొనేందుకు వస్తున్నారు. ప్రస్తుతం పత్తి, కంది, మొక్కజొన్న తదితర పంటలకు పైపాటిగా ఎరువులు వేస్తున్నారు. ఇదే సమయంలో వరినాట్లు కూడా ముమ్మరంగా వేశారు. ఈ పరిస్థితుల్లో యూరియాకు డిమాండ్ పెరిగింది. జిల్లాకు అవసరమైన ఎరువుల్లో 25 శాతం కూడా అందుబాటులో లేవని తెలిసింది.

ప్రైవేటు డీలర్ల వద్దే..

జిల్లాలో ఎరువుల అవసరం కొండంత ఉంటే అందుబాటులో ఉన్నది గోరంత మాత్రమే. ప్రస్తుతం 5,00,435 ఎకరాల్లో ఆయా పంటలు వేశారు. ఇందుకు 1,13,851 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రస్తుతం 6,230 మెట్రిక్ టన్నులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. 39,898 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా 15 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే పంపిణీ చేశారు. ప్రస్తుతం 1,138 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంది. ఇందులో ప్రైవేటు డీలర్ల దగ్గర 876 మెట్రిక్ టన్నులు, ఆయా సొసైటీల వద్ద 261 మెట్రిక్ టన్నులు ఉంది. ప్రైవేటు డీలర్ల వద్ద 5,314 మెట్రిక్ టన్నులు సొసైటీల వద్ద 916 మెట్రిక్ టన్నులు మాత్రమే ఉంది. ఇలా ఉన్న వాటిలో ఎక్కువ శాతం ప్రైవేటు డీలర్లకే కేటాయించారు.

డిమాండ్ ఎక్కువగా ఉంది

జిల్లాలో ఎంత మేర ఎరువులు కావాలో నివేదిక సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాం. ప్రస్తుత అవసరాలకు ఎలాంటి కొరత లేదు. డిమాండ్ ఎక్కువగా ఉంది. అవసరం మేరకు డీఏపీ, యూరియాని అందుబాటులో ఉంచుతున్నాం. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఏరోజుకారోజు తెప్పించి పంపిణీ చేస్తున్నాం.

– రాజరత్నం, జిల్లా వ్యవసాయాధికారి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్ తదితరులు

హామీలన్నీ అమలు చేస్తున్నాం

- స్పీకర్ ప్రసాద్ కుమార్
- బురాన్‌పల్లిలో పనుల జాతర ప్రారంభం

అనంతగిరి: బురాన్‌పల్లిని దత్తత తీసుకొని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని స్పీకర్ ప్రసాద్ కుమార్ అన్నారు. శుక్రవారం ఆ గ్రామంలో పనుల జాతర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రూ.20 లక్షలతో గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ.63 లక్షలతో పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి బురాన్‌పల్లి వరకు ఆరు కొత్త బీటీ రోడ్డు, మరో రూ.63 లక్షలతో బురాన్‌పల్లి – ధన్నారం బీడీ రోడ్డు పనులను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తోందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగు పడితే అన్ని హామీలు నెరవేరుస్తామన్నారు. గత ప్రభుత్వం రూ. 6వేల కోట్లు అప్పు చేసిందని, వీటికి రూ.6,500 కోట్లు వడ్డీ చెల్లిస్తున్నట్లు తెలిపారు. అయినా సంక్షేమం, అభివృద్ధి కొనసాగిస్తున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వం ఒక్క ఇల్లు, రేషన్ కార్డు కూడా ఇవ్వలేదన్నారు. ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత అర్హులందరికీ ఇళ్లు, రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వం రద్దు చేసిన అసైన్మెంట్ కమిటీని పునరుద్ధరించి భూములు లేని పేదలకు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలని తహసీల్దార్‌కు సూచించారు. మహిళలను కోటీశ్వరులు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. డ్వాక్రా సంఘాలకు వడ్డీ లేకుండా రూ.10 లక్షలు చొప్పున అందించడం జరుగుతుందన్నారు. ఉపాధి హామీ పథకం కింద ఉద్యానవన మొక్కలు నాటేందుకు ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ శ్రీనివాస్, ఆర్టీఏ సభ్యులు జాఫర్, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ వినయ్ కుమార్, పంచాయత్ రాజ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్, మండల పంచాయతీ అధికారి దయానంద్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి, నాయకులు మనోహర్‌గౌడ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేవీ రాడార్ పనుల పరిశీలన



ప్రశంసాపత్రం అందుకుంటున్న ఎస్పీ నారాయణరెడ్డి

పూడూర్: మండల పరిధిలోని దామగుండం అటవీ ప్రాంతంలో జరుగుతున్న నేవీ రాడార్ స్టేషన్ పనులను శుక్రవారం భారత నౌకాదళ ఉపాధిపతి వైస్ అడ్మిరల్ తరుణ్ సోబ్తి పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేస్తున్న మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. పనుల పురోగతి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఎస్పీకి ప్రశంసాపత్రం

అనంతగిరి: అంకితభావంతో విధులు నిర్వహించినందుకు గాను ఎస్పీ నారాయణరెడ్డికి భారత నౌకాదళం ప్రశంసాపత్రం అందజేసింది. శుక్రవారం దామగుండంలో నౌకాదళ ఉప అధికారి, వైస్ అడ్మిరల్ తరుణ్ సోబ్తి ఎస్పీకి ప్రశంసాపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు లేన్ల రోడ్లకు ప్రత్యేక కృషి

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: రాష్ట్రంలోని నలుమూలల నుంచి నాలుగు లేన్ల రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. అప్ప జంక్షన్ నుంచి మన్నేగూడ వరకు జరుగుతున్న నేషన్ హైవే విస్తరణ పనులను శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రూ.1,050 కోట్లతో పనులు చేపట్టినట్లు వివరించారు. హైవే నిర్మాణానికి అన్ని అడ్డంకులు తొలిగాయన్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న మర్రి చెట్ల విషయంలో గ్రీన్ ట్రిబ్యూనల్‌లో కేసు వేసిన పర్యావరణ వేత్తలు కేసు ఉపసంహరించుకుంటామని హామీ ఇచ్చారన్నారు. మన్నేగూడ నుంచి రావులపల్లి వరకు రూ.1,000 కోట్లతో నాలుగు లేన్ల రహదారి మంజూరైందన్నారు.

క్రీడలతో మానసిక ప్రశాంతత

కుల్కచర్ల: క్రీడలతో మానసిక ప్రశాంతత పొందవచ్చని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కుల్కచర్లలో జోనల్ స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ క్రీడలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఎంపీటీసీ భాస్కర్ గౌడ్ తన తల్లి ఈడిగి యాదమ్మ జ్ఞాపకార్థం తెచ్చిన దుస్తులను ఎమ్మెల్యేతో క్రీడాకారులకు అందజేశారు.



పరిగి: రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే టీఆర్ఆర్

టీబీ రహిత సమాజమే ధ్యేయం

బొంరాస్‌పేట: టీబీ నుంచి ప్రజలందరినీ వి ముక్తి చేయాలనే సంకల్పంతో టీబీ ముక్త్ భా రత్ అభియాన్ కార్యక్రమం చేపట్టినట్లు జిల్లా టీబీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రవీంద్రయాదవ్ తెలిపారు. ఇందులో భాగంగా నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శుక్రవారం మండలంలోని రేగడిమైలారంలో నిర్వహించిన ప్రత్యేక శిబిరంలో 100 మందికి టీబీ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి హేమంత్, ఎంఎల్‌హెచ్‌పీలు నవ్యశ్రీ, మంజుల, టీబీ సూపర్ వైజర్ రహత్, ఏఎన్‌ఎం పద్మ, పంచాయతీ కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో సీజనల్ వ్యాధులకు చెక్

- మున్సిపల్ కమిషనర్ యాదగిరి
- పలు వార్డుల్లో పర్యటన

తాండూరు టౌన్: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే సీజనల్ వ్యాధులను నివారించవచ్చని మున్సిపల్ కమిషనర్ యాదగిరి అన్నారు. డ్రైడేను పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటించారు. దోమల నివారణకు రసాయనాల పిచికారీ, బ్లీచింగ్ పౌడర్ చల్లడంతో పాటు, మురుగు కాలువలను శుభ్రం చేయించారు. ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణ ప్రజలు ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రం చేసుకోవాలన్నారు. టైర్లు, కొబ్బరి బొండాలు, పూల కుండీలు తదితర వాటిలో నీరు నిల్వ లేకుండా జాగ్రత్త వహించాలన్నారు. తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ ప్రవీణ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



కలెక్టర్‌కు మొక్కను బహూకరిస్తున్న యాదగిరి

కలెక్టర్‌ను కలిసిన కమిషనర్

తాండూరు: తాండూరు మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్న బి.యాదగిరి శుక్రవారం కలెక్టర్ ప్రతీక్‌జైన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. మున్సిపాలిటీలో సమస్యలు లేకుండా చూడాలని, ప్రజలకు సత్వర సేవలు అందించాలని కలెక్టర్ సూచించారు.

రూ.8 కోట్లతో అభివృద్ధి పనులు

- అన్ని రోడ్లను బాగు చేయిస్తాం
- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి
- పెద్దేముల్‌లో పనుల జాతర ప్రారంభం



ఇందూరులో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు రూరల్: స్థానిక సంస్థలకు త్వరగా ఎన్నికలు నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరినట్లు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి తెలిపారు. సెప్టెంబరులో నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందన్నారు. శుక్రవారం పెద్దేముల్ మండలంలో పనుల జాతర కార్యక్రమాన్ని ప్రారంభించారు. బండపల్లి, సిద్దన్న మడుగు తండా, ఇందూర్ గ్రామాల్లో అంగన్‌వాడీ, గ్రామ పంచాయతీ భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో పాలన స్తంభించి పోయిందని స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహిస్తే సమస్యలు తొలగిపోతాయని పేర్కొన్నారు. పనుల జాతరలో కార్యక్రమంలో భాగంగా తాండూరు నియోజకవర్గానికి రూ.8 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. మార్చి 31లోగా పనులు పూర్తి చేస్తామన్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన తర్వాత రోడ్లను బాగు చేయిస్తామని తెలిపారు. కాంగ్రెస్ అంటేనే సంక్షేమన్నారు. నిజమైన పేదలకు మాత్రమే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటకు కట్టుబడి తాండూరును అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. రూ.6 కోట్లతో ఇందూరు – పెద్దేముల్ వరకు బీటీ రోడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. కోట్‌పల్లి ప్రాజెక్టు మరమ్మతులకు రూ.100 కోట్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. కొంత మంది అధికారులు అవినీతికి పాల్పడుతున్నారని వారి మార్పు రావాలని అన్నారు. తాండూరు మున్సిపాలిటిలో ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులను వెంటనే బదిలీ చేసినట్లు చెప్పారు. ప్రభుత్వానికి చెడ్డపేరు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, తట్టెపల్లి సొసైటీ చైర్మన్ లక్ష్మారెడ్డి, కోట్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ అంజయ్య, నారాయణరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గోపాల్, మండల ప్రత్యేకాధికారి సత్యనారాయణ, సీడీపీఓ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వసతులు కల్పిస్తాం

యాలాల: గ్రామాల్లో వసతుల కల్పనే లక్ష్యంగా పనుల జాతర కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జుంటుపల్లి, పగిడిపల్లి, ముకుందాపూర్ గ్రామాల్లో పనుల జాతర కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. ఆయా గ్రామాల్లో కొత్త పంచాయతీ భవనాల నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, మాజీ అధ్యక్షుడు బీమప్ప, బీ బ్లాక్ అధ్యక్షుడు అనిల్‌కుమార్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వీరేశం, ఏఎంసీ డైరెక్టర్ రాజు, నాయకులు హన్మంతు, అక్బర్‌బాబా, మహిపాల్, చంద్రశేఖర్‌గౌడ్, మల్లప్ప, విజయ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

మండపాలకు అనుమతులు తప్పనిసరి

బంట్వారం ఎస్‌ఐ విమల



బంట్వారం: గణేశ్ మండపాలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని బంట్వారం ఎస్‌ఐ విమల పేర్కొన్నారు. శుక్రవారం ఆమె పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఉత్సవ కమిటీలు పోలీసుల నియమాలను పాటించాలన్నారు. మండపాల ఏర్పాటుకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఊరేగింపు సమయంలో ట్రాఫిక్ రూల్స్‌తో పాటు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలన్నారు. ప్రత్యేకంగా డీజేలకు అనుమతిలేదన్నారు. విద్యుత్ కనెక్షన్ల కోసం ట్రాన్స్‌కో అధికారుల అనుమతి ఉండాలన్నారు. మండపాల్లో అనుమానిత బ్యాగులు, ప్లాస్టిక్ సంచులు ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

పోలీస్ కస్టడీలో బీఆర్‌ఎస్ నేత!

దోమ: అక్రమ మైనింగ్ కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న బీఆర్‌ఎస్ నేత, దోమ జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోప్పుల నాగిరెడ్డిని విచారణలో భాగంగా పోలీసులు ఐదు రోజుల కస్టడీకి తీసుకున్నారు. గురువారం మొదటి రోజు చన్గోముల్ పీఎస్‌కు తీసుకువచ్చిన ఆయనను అక్రమ మైనింగ్ ఎలా తీశారు? అనే కోణంలో తన తరఫు లాయర్ల సమక్షంలో పోలీసులు విచారణ చేశారు. శుక్రవారం సీన్ రీ కన్‌స్ట్రక్షన్‌లో భాగంగా పోలీసులు దిర్సంపల్లికి తీసుకువచ్చారు. ఏ ఏ ప్రాంతంలో మైనింగ్ జరిపారు? ఎంత మేరకు తీశారు? అనే కోణంలో ప్రశ్నించారు. తదనంతరం అక్కడి నుంచి పీఎస్‌కు తరలించారు.

పాంబండలో పాము



కుల్కచర్ల: మండల పరిధిలోని బండవెల్కిచర్లలో ప్రసిద్ధిగాంచిన శ్రీ పాంబండ దేవాలయంలో ఓ పాము ప్రత్యక్షమైంది. శుక్రవారం నాగుపాము ఆలయంలోనికి ప్రవేశించి పడగ విప్పింది. దీంతో ఆలయానికి మొక్కులు చెల్లించుకునేందుకు వచ్చిన భక్తులు ముందుగా భయభ్రాంతులకు గురికాగా, ఆ తర్వాత పాము పడగ విప్పడంతో మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలోకి సర్పం రావడంతో నిష్టతో భక్తులు పూజలు చేశారు. కొద్దిసేపటికి ఆలయ సిబ్బంది పామును పట్టుకొని అటవీ ప్రాంతంలో వదిలేశారు.

కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పండి

బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి



సమావేశంలో పాల్గొన్న బీఆర్‌ఎస్ నాయకులు

ధారూరు: బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి సూచించారు. మండలంలోని కుక్కింద గ్రామంలో శుక్రవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతు, ప్రజా సమస్యలను కాంగ్రెస్ గాలికి వదిలివేసిందన్నారు. ఆరు గ్యారంటీల అమలులో విఫలమైందని ఆరోపించారు. సమావేశంలో నాయకులు భీంసేన్‌చారీ, లక్ష్మయ్య, వేణుగోపాల్‌రెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను వేగం చేయాలి



ఎన్కేపల్లిలో ఇందిరమ్మ ఇంటిని పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ సంధ్యారాణి

పూడూరు: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని డీఎల్‌పీఓ సంధ్యారాణి తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని ఎన్కేపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని రెండు వందలకు పైగా ఇళ్లను మంజూరు చేసిందన్నారు. ప్రతిఒక్కరూ హౌసింగ్ అధికారులు ఇచ్చిన కొలతల ప్రకారం నిర్మాణాలు చేపట్టాలని లబ్ధిదారులకు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, లబ్ధిదారులు ఉన్నారు.

నిషేధిత పొగాకు పట్టివేత

ఇబ్రహీంపట్నం రూరల్: నిషేధిత పొగాకు విక్రయాలపై ఎస్‌ఓటీ, ఆదిబట్ల పోలీసులు దాడి చేశారు. భారీ ఎత్తున పొగాకు, గుట్కా నిల్వలను సీజ్ చేశారు. ఈ ఘటన ఆదిబట్ల ఠాణా పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఆదిబట్ల పోలీసులు తెలిపిన ప్రకారం.. మున్సిపాలిటీ పరిధిలోని బొంగ్లూర్ ఎక్స్‌రోడ్డు వద్ద మాతాజీ కిరాణం జనరల్ స్టోర్‌లో అక్రమంగా నిషేధిత గుట్కా విక్రయిస్తున్నారనే సమాచారంతో మహేశ్వరం జోన్ ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేశారు. నిషేధిత పాన్‌మసాల నిల్వలను సీజ్ చేశారు. బొల్లారం కుమావత్, రాజ్‌కుమార్‌లపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

ఇదేం రహదారి!

- వర్షాలతో బురదమయం
- అవస్థలు పడుతున్న వాహనదారులు
- నత్తనడకన హైవే పనులు
- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్



అల్లాపూర్ వద్ద పెద్ద గుంతలో నిలిచిన వర్షపు నీరు

తాండూరు రూరల్: మండలంలో నిర్మిస్తున్న హైవే రోడ్డును చూసి జనాలు విసిగిపోతున్నారు. మహబూబ్‌నగర్ నుంచి కర్ణాటక రాష్ట్రం మన్నెకెల్లి వరకు జాతీయ రహదారి నంబరు 167 నిర్మిస్తున్నారు. ఇందులో భాగంగా మండలంలో అల్లాపూర్ నుంచి కోత్లాపూర్ వరకు 15 కిలో మీటర్లమేర రహదారి నిర్మాణ పనులు సాగుతున్నాయి. రెండేళ్ల క్రితం పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ ఇప్పటి వరకు పనులు పూర్తి చేయలేదు. అసంపూర్తిగా రహదారి పనులు కొనసాగడంతో మండల ప్రజలతో పాటు కర్ణాటకకు వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారం రోజులుగా కురిసిన వర్షానికి హైవే రోడ్డంతా బురదమయమైంది. ముఖ్యంగా అల్లాపూర్ బ్రిడ్జి వద్ద గుంతలు ఏర్పడి వర్షపు నీరు నిలవడంతో ద్విచక్ర వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఇక రాత్రి సమయంలో గుంతలు కనిపించకపోవడంతో భయందోళన వ్యక్తం చేస్తున్నారు. అల్లాపూర్ నుంచి కోత్లాపూర్ వరకు జాతీయ రహదారిపై నరకం చూస్తున్నామని మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా హైవే అధికారులు, కాంట్రాక్టర్లు చొరవచూపి హైవే పనులు త్వరగా పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.



సిరిగిరిపేట్ వద్ద బురదమయమైన రోడ్డుపై వెళ్తున్న వాహనాలు

ఫోర్జరీ కేసులో కొనసాగుతున్న విచారణ

డీఎస్పీ బాలకృష్ణారెడ్డి



తాండూరు: తెలంగాణ గ్రామీణ బ్యాంకులో మహిళ దాచుకున్న ఫిక్స్‌డ్ డిపాజిట్ డబ్బులను ఫోర్జరీ చేసిన ఘటనలో విచారణను వేగవంతం చేశామని తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం డీఎస్పీ, బ్యాంకు మేనేజర్‌లు వేర్వేరుగా విలేకరులతో మాట్లాడారు. తాండూరు ప్రాంతానికి చెందిన విశాలాక్షి తెలంగాణ గ్రామీణ బ్యాంకులో 2008లో రూ.2.89 లక్షలు డిపాజిట్ చేసిందన్నారు. మూడేళ్ల తర్వాత అదే బ్యాంకులో మరో రూ.3.15 లక్షలను డిపాజిట్ చేసిందన్నారు. బాండ్‌ల గడువు ముగియడంతో డబ్బులను తీసుకొనేందుకు గత నెల 29వ తేదీన మహిళ బ్యాంకుకు కోరడంతో అక్రమాలు వెలుగులోకి వచ్చిందన్నారు. అప్పట్లో డెక్కన్ గ్రామీణ బ్యాంకుగా సేవలు అందిస్తోంది. ఆన్‌లైన్ విధానం రావడంతో ప్రస్తుతం డిజిటల్ లావాదేవీలు కొనసాగుతున్నాయన్నారు. 2022 వరకు తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఔట్ సోర్సింగ్ ఉద్యోగి ప్రేమ్ సింగ్‌పై అనుమానం రావడంతో ఫిర్యాదు స్వీకరించి విచారణ చేస్తున్నామన్నారు. త్వరలోనే పూర్తి వివరాలను తెలియజేస్తామని అధికారులు తెలిపారు.

మేకల అపహరణ

కుల్కచర్ల: పశువుల పాకలో కట్టేసిన మేకలను గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన కుల్కచర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ రమేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బండవెల్కిచర్లకు చెందిన జి.బాలయ్యకు 50కి పైగా మేకలు ఉన్నాయి. ఎప్పటిలాగే వాటిని గురువారం సాయంత్రం తన పొలంలోని పాకలో కట్టేసి ఇంటికి వెళ్లాడు. శుక్రవారం పొలానికి వెళ్లి చూడగా పాకలో మేకలు కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమేశ్‌కుమార్ తెలిపారు.

గుట్కా వాహనం పట్టివేత

పరిగి: గుట్కా తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. ఈ ఘటన పరిగి పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్సై మోహన్‌కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 20వ తేదీ అర్ధరాత్రి పోలీసులు బీఎస్‌ఎన్‌ఎల్ ఆఫీస్ ముందు వాహనాల తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా వెళ్తున్న వాహనాన్ని ఆపి పరిశీలించగా అందులో గుట్కా ప్యాకెట్లు ఉన్నట్లు గుర్తించారు. 48 సంచులలోని గుట్కాలను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.12లక్షల వరకు ఉంటుందని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చెరువు కట్టకు మరమ్మతులు చేపట్టండి

ధారూరు: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని గట్టెపల్లి లింగం చెరువు కట్ట తెగిపోయిందని, వెంటనే మరమ్మతులు చేయించాలని శుక్రవారం కోరారు. చెరువు కట్ట తెగిపోవడంతో నీరంతా వృథాగా పోతోందని తెలిపారు. కట్ట, తూముకు మరమ్మతులు చేయించాలని డిమాండు చేశారు. చెరువులో నీరు లేకుంటే ఆయకట్ట భూముల్లో వేసిన పంటలు దెబ్బతింటాయని తెలిపారు. ఇరిగేషన్ అధికారులు యుద్ధప్రాతిపదికన పనులు చేయించాలని రైతులు కోరారు.

వేగంగా అభివృద్ధి పనులు

కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి



ఏటీసీ నమూనాను పరిశీలిస్తున్న కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి

దుద్యాల్: ప్రభుత్వ అభివృద్ధి పనుల నిర్మాణాలు వేగంగా కొనసాగించాలని కడా ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని హకీంపేట్ గ్రామంలోని కొనసాగుతున్న అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ నిర్మాణ నామునాను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా జరుగుతున్న నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని, త్వరగా భవనాలు అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్లకు సూచించారు. కార్యక్రమంలో పంచాయత్ రాజ్ ఏఈ సురేందర్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సంజీవరెడ్డి, నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్, సాయిలు, రాజు పాల్గొన్నారు.

భారతి సిమెంట్‌కు తిరుగులేదు

సంస్థ టెక్నికల్ మేనేజర్ సునీల్



భారతి సిమెంట్ డీలర్‌లతో సంస్థ ప్రతినిధులు

తాండూరు: భారతి అల్ట్రాఫాస్ట్ సిమెంట్‌తో నిర్మాణాల వేగంగా పూర్తవుతాయని ఆ సంస్థ టెక్నికల్ మేనేజర్ సునీల్ తెలిపారు. శుక్రవారం తాండూరు పట్టణంలోని దుర్గా గ్రాండర్‌లో సబ్ డీలర్‌లకు భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ 5 స్టార్ గ్రేడ్‌తో తెలంగాణ రాష్ట్రంలో విడుదల చేసిన సిమెంట్‌పై డీలర్‌లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌తో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్ సిమెంట్‌తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగంగా పూర్తవుతోందన్నారు. ప్రధానంగా స్లాబులకు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారులకు ఎంతో మన్నికగా ఉంటుందన్నారు. అల్ట్రాఫాస్ట్ సిమెంట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందిస్తామన్నారు. స్లాబ్ కాంక్రీట్ సమయంలో నిష్ణాతులైన ఇంజినీర్లను సైట్ వద్దకే వచ్చి సహాయ పడతారన్నారు. అనంతరం డీలర్‌లు మాట్లాడుతూ.. భారతి సిమెంట్ సంస్థ ప్రతినిధులు సేవలు చాలా ఫాస్ట్‌గా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ మార్కెటింగ్ మేనేజర్ సతీష్ రాజు, అసిస్టెంట్ మార్కెటింగ్ మేనేజర్ వీరాంజనేయరెడ్డి, టెక్నికల్ ఇంజినీర్ సామ్రాట్, భారతి సిమెంట్ డీలర్‌లు తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాల్లో పొరపాట్లు జరగొద్దు

తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్



అధికారులతో మాట్లాడుతున్న ఉమాశంకర్ ప్రసాద్

తాండూరు: వినాయక చవితి ఉత్సవాల్లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలని తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ అధికారులకు సూచించారు. శుక్రవారం తాండూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, హిందూ ఉత్సవ సమితి ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా మండపాలు ఏర్పాటు చేసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో హిందూ ఉత్సవ సమితి అధ్యక్షులు స్వప్న పరిమళ్, కార్యదర్శి పట్లోళ్ల నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయండి



తాండూరు రూరల్: వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

తాండూరు రూరల్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లో నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని పీఆర్‌టీయూ తాండూరు మండల అధ్యక్ష, కార్యదర్శులు జొన్నల వినోద్‌కుమార్, పురుషోత్తంరెడ్డిలు పేర్కొన్నారు. బెల్కటూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మహాధర్నాకు సంబంధించి పోస్టర్‌ను విడుదల చేశారు. పాత సీపీఎస్ విధానం కొనసాగించాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లో నిర్వహించే ధర్నాకు ఉపాధ్యాయులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రాంనర్సింహారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి

దోమ: సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు ఆర్.కేశవులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో సీపీఎస్ విద్రోహ దినాన్ని పురస్కరించుకొని హైదరాబాద్ నగరంలోని ఇందిరాపార్క్ దగ్గర సెప్టెంబర్ 1వ తేదీన జరిగే మహాధర్నా వాల్‌పోస్టర్ ఆ సంఘం నేతలతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలో ప్రవేశపెట్టిన సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను వెంటనే అమలు చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుల బృందం తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం లోపిస్తే వ్యాధుల విజృంభణ

తాండూరు మున్సిపల్ కమిషనర్ యాదగిరి



పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్, ఇతర అధికారులు

తాండూరు: పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని తాండూరు మున్సిపల్ కమిషనర్ బి.యాదగిరి అన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని సాయిపూర్, 11వ వార్డు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. 100 రోజుల ప్రణాళిక పనుల్లో భాగంగా పారిశుద్ధ్య పనులను కార్మికులతో ముందుండి చేయించారు. మురుగు కాల్వల్లో చెత్త లేకుండా నిత్యం శుభ్రం చేయాలన్నారు. వర్షాకాల సీజన్ కావడంతో పారిశుద్ధ్యం లోపిస్తే సీజనల్ వ్యాధులు పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రజలు తడి, పొడి చెత్తను వేరు చేసి పారిశుద్ధ్య సిబ్బందికి అందించాలన్నారు. వీధుల్లో చెత్త వేసి పరిసరాలను అపరిశుభ్రంగా మార్చకుండా సహకరించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమేష్, మున్సిపల్ ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ ప్రవీణ్, పారిశుద్ధ్య విభాగం సిబ్బంది శ్రీనివాస్, వీరన్న పాల్గొన్నారు.

నీటి ఎద్దడికి ముందస్తు చర్యలు



ముద్దాయిపేటలో బోరును ప్రారంభిస్తున్న ఏఈ, నాయకులు

యాలాల: నీటి ఎద్దడి రాకుండా ఉండేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా నూతన బోరును వేయించినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని ముద్దాయిపేటలో స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి పనుల జాతరలో భాగంగా కొత్తగా వేసిన బోరుకు మోటారు బిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మంజూరు చేసిన డీఎంఎఫ్‌టీ రూ.2.50లక్షల నిధులతో గ్రామంలో కొత్త బోరు, మోటారు ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కుమార్, నాయకులు ఆరిఫ్ హుస్సేన్, వెంకటయ్యగౌడ్, మురళీగౌడ్, గోపాల్‌నాయక్, వాటర్‌మెన్ ఫరీద్ తదితరులు ఉన్నారు.

ఇంట్లో చోరీ జరిగిందని హంగామా!

రూ.2.50 లక్షలు మాయమయ్యాయని హడావుడి

యాలాల: తమ ఇంట్లో భారీ చోరీ జరిగిందని రూ.2.50 లక్షలు మాయమయ్యాయని పేర్కొనడంతో పోలీసులు ఉరుకులు పరుగులు పెట్టాల్సి వచ్చింది. చివరకు కుటుంబ సభ్యుల మధ్య సమాచార లోపంతో డబ్బులు ఉన్న చోటే ఉండటంతో ఊపిరి పీల్చుకున్నారు. ఈ సంఘటన మండలంలోని అచ్యుతాపూర్ గ్రామంలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గొల్ల శివయ్య ఇటీవల బ్యాంకు నుంచి తెచ్చిన రూ.2.50 లక్షలను ఇంట్లో ఓ చోట పెట్టి యథావిధిగా పొలం పనులకు వెళ్లాడు. ఉదయం పరిగి ప్రాంతానికి చెందిన ముగ్గురు వ్యక్తులు పిల్లులు పట్టేందుకు గ్రామంలో తిరిగి వెళ్లిపోయారు. అదే సమయంలో గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి వెళ్లారని తెలియడంతో శివయ్య ఇంటికి వెళ్లి తాను డబ్బులు దాచిన ప్రదేశానికి బదులు మరోచోటా వెతికాడు. డబ్బులు ఆ చోటా ఉండకపోవడంతో లబోదిబోమంటూ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దీంతో రూరల్ సీఐ నగేష్, ఎస్‌ఐ విఠల్ గ్రామానికి చేరుకొని వివరాలు సేకరించారు. గ్రామంలో సంచరించిన ముగ్గురు వ్యక్తుల ఆచూకీ కోసం ఐడీ పార్టీ పోలీసులు పరిగికి వెళ్లి వారిని గుర్తించి వివరాలు సేకరించారు. కాగా శుక్రవారం సాయంత్రం శివయ్య కుటుంబ సభ్యులు ఇంట్లో మరోచోటా వెతకగా అక్కడ డబ్బులు కనిపించాయి. హడావుడిలో శివయ్య తాను దాచిన ప్రదేశం మరిచి, మరోచోటా డబ్బులు వెతకడంతో ఇదంతా జరిగిందని గ్రహించాడు. కాగా బాధితుడు డబ్బులు లభించడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

వీడిన ఆలయాల చోరీ కేసు

- నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- రిమాండ్‌కు తరలింపు
- కేసు వివరాలు వెల్లడించిన రూరల్ సీఐ నగేష్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ నగేష్

యాలాల: మండల పరిధిలోని సంగెంకుర్దు శివారులో గల సంగమేశ్వరాలయం, శనీశ్వర ఆలయంలో జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించారు. శుక్రవారం రాత్రి పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రూరల్ సీఐ నగేష్ వివరాలు వెల్లడించారు. యాలాల గ్రామానికి చెందిన బోయిని హరీష్, ఉప్పరి అరవింద్ స్నేహితులు. జులాయిగా తిరుగుతూ మద్యానికి బానిసయ్యారు. ఎలాగైనా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో చోరీకి ప్లాన్ చేశారు. ఈ నెల 19న సంగెంకుర్దు శివారులో ఉన్న సంగమేశ్వరాలయం, శనీశ్వరాలయంలో చోరీ చేయాలని నిర్ణయించుకున్నారు. రాత్రి చోరీకి వెళ్లే సమయంలో తమ వెంట ఒక సుత్తి, ఐరన్‌రాడ్, వంటలకు వినియోగించే గరిటేను తీసుకెళ్లారు. వాటితో ఆలయ ప్రధాన గేటు తాళం పగులగొట్టి లోనికి వెళ్లారు. ఆలయ ఆవరణలో ఉన్న హుండీ తాళం విరగ్గొట్టి రూ.20వేల నగదును ఎత్తుకెళ్లారు. అనంతరం పక్కనే ఉన్న శనీశ్వరాలయంలోకి వెళ్లి అక్కడి హుండీ తాళం విరగ్గొట్టి రూ.10వేల నగదుతో హైదరాబాద్‌కు ఉడాయించారు. చోరీ ఘటన అనంతరం ఫిర్యాదు అందుకున్న పోలీసులు వివరాలు సేకరించి అనుమానితులైన వీరిని అదుపులోకి విచారించగా నేరం ఒప్పుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితుల నుంచి చోరీ సొత్తులో రూ.8 వేలు ఖర్చు కాగా, రూ.22వేలతో కొనుగోలు చేసిన సౌండ్ సిస్టంకు వినియోగించే (ఆంప్లిఫైర్)స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ విఠల్, ఐడీ పార్టీ హెడ్ కానిస్టేబుల్ దస్తప్ప, కానిస్టేబుళ్లు నరేష్, వెంకటయ్య ఉన్నారు.

బీజేపీ నేతల ముందస్తు అరెస్టు



పూడూరు: చన్గోముల్ పోలీస్‌స్టేషన్‌లో నాయకులు

కొడంగల్ రూరల్: బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సేవ్ హైదరాబాద్‌లో భాగంగా సచివాలయ ముట్టడికి తరలుతున్న నాయకులను శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రజాస్వామ్యయుతంగా వెళుతున్న తమని అరెస్టు చేయడం అన్యాయమని పలువురు పేర్కొన్నారు. అరెస్టయిన వారిలో గంటి సర్వేష్‌కుమార్, కరాటే శ్రీనివాస్, సాయికుమార్, అరుణ్, అనిల్ తదితరులున్నారు.

బీసీ రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి చేయాలి

దోమ: అక్రమ అరెస్టుతో ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన పథకాలను ఆపలేరని బీజేపీ మండల అధ్యక్షుడు బొంగు మల్లేశ్ మండిపడ్డారు. శుక్రవారం మండలం నుంచి రాష్ట్ర అధ్యక్షుడు ఇచ్చిన పిలుపు మేరకు చలో సచివాలయానికి వెళ్తున్న తమను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారన్నారు. ఇప్పటికైనా బీసీ రిజర్వేషన్ల ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలన్నారు. లేని పక్షంలో గ్రామాలలో ఆందోళనలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు ఇవ్వాలి

పూడూరు: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సినిమా సెన్సార్‌బోర్డు సభ్యుడు మల్లేష్ పటేల్ డిమాండ్ చేశారు. శుక్రవారం రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు సెక్రటేరియట్ ముట్టడి కార్యక్రమానికి వెళ్లకుండా అరెస్టులు చేయడం ఏమిటని ప్రశ్నించారు. బీజేవైఎం పూడూరు మండల అధ్యక్షుడు నవీన్‌జోషి, జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీశైలం, బూత్ అధ్యక్షులు సత్యనారాయణ, జంగయ్యలను అరెస్టు చేసి చన్గోముల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

అక్రమ అరెస్టులు అన్యాయం

దౌల్తాబాద్: హైదరాబాద్‌లో సచివాలయ ముట్టడికి బయలుదేరుతున్న బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రాష్ట్రంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీజేపీ హైదరాబాద్‌లోని సెక్రెటరేట్ ముట్టడికి పిలుపునిచ్చింది. ఇందుకు ముందస్తుగా నాయకులను అరెస్టు చేశారు. అనంతరం సొంత పూచికత్తుపై విడుదల చేశారు. అరెస్టయిన వారిలో పార్టీ మండల అధ్యక్షుడు అశోక్, నేతలు సములప్ప, సురేష్, మొహన్‌రెడ్డి, ప్రభాకర్ తదితరులున్నారు.

అరెస్టులు అప్రజాస్వామికం

కుల్కచర్ల: రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండకట్టేందుకు వెళ్తున్న బీజేపీ నేతలను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించడం అప్రజాస్వామికమని పార్టీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కాటన్‌పల్లి అంజిలయ్య అన్నారు. శుక్రవారం రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పిలుపు మేరకు చలో సచివాలయ ముట్టడికి వెళ్తున్న బీజేపీ నేతలను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారని అన్నారు. వెంటనే బీసీ రిజర్వేషన్ల ప్రకటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు పాల్గొన్నారు.



కొడంగల్ రూరల్: పోలీసుల అదుపులో నాయకులు



దోమ: పోలీసుల అదుపులో..



కుల్కచర్లలో అరెస్టయిన బీజేపీ నేతలు



దౌల్తాబాద్: ఠాణా ఎదుట బీజేపీ నాయకులు